# గడ్డి పరకలు



తాళ్ళూరి నాగేశ్వరరావు

తొలికోడి తెల్లవారు ఝామున  గంటలకు కూయవచ్చు. కాని పొలం
మూడు గంటలకి కూయ  లోని పాలకేంద్రపు గంటమాత్రం
వచ్చు; ఆలస్యంగా  అయిదున్నర  ఠంచన్‌గా నాలుగున్నరకే మోగు

తుంది చెవుల్లోనరాలు జీవ్వుమనేట్టు. ఆ గంటమోత ప్రశాంతంగా నిద్ర పోతూన్న పొలాన్ని వెన్నుతట్టి ఉలిక్కిపడేట్టు లేపుతుంది.

ఆ వూళ్ళోకి పాలకేంద్రంవచ్చాక వూరు వూరంతా పెందలకడనే మేల్కోవడం నేర్చుకొంది. ముఖ్యంగా ఆడవాళ్ళు ఆ గంటమోతకు అదరా బాదరాలేచి, అవలింపులతో ఆక్షణం కూడా వృధావుచ్చకుండా, నేరుగా గేదెల దగ్గరకు పాలతపేళాలు పుచ్చుకొని పరుగెత్తడం నిత్య కృత్యమై పోయింది.

ఆ రోజు తెల్లవారుఝామున నాలుగున్నర గంట మోగిన మరు క్షణంలోనే మంగమ్మ పెద్దకోడలు సుబ్బమ్మ చివుక్కున నులకమంచం మీదనుంచి లేచింది. జారిన వేలు ముడినికూడా వేసుకోకుండా వంట గదిలోకి వెళ్ళింది. పెద్దగూట్లో బోర్లించిన పాలతపేళా పుచ్చుకొని మూడు అంగల్లో గొడ్లచావట్లోకి వచ్చింది.

మొగుడు రంగయ్య నవారు మంచంమీద గురకలు పెడుతూనే ఉన్నాడు. తండ్రి నడుంమీద కుడి కాలేసుకొని పడుకున్నాడు మూడేళ్ల కొడుకు.

నట్టింట ముక్కాలిపీటమీదున్న కోడిగుడ్డు లాంతరు కునికిపాట్లు పడు తోంది.

బయట మసక మసకగా ఉంది.

ఊరు మేల్కొన్న సందడి జోరుగా వినవస్తూన్నది. బావుల మీద గిలకచప్పుళ్లు; కుడితికోసం గేదెల అరుపులు; పొలంవెళ్ళే ఎడ్ల మెడల్లోని వత్తిడముువ్వల, గంటల మోతలు; ఇళ్ళముందు కసివూడ్చే చీపుళ్ళ చప్పుళ్ళు - మొదలైనవి ఊరికి మేలుకొలుపు సంగీతాన్ని ఆలాపిస్తున్నాయి,

పాల తపేళాను రాతిగాబు పక్కనేపెట్టి, బుంగలోని కుడితిని తెచ్చి, ఆ గాబులో పోసింది సుబ్బమ్మ. ఓ కడవనీళ్ళుమ కూడా ఆ గాబులో గుమ్మరించి, తవుడుగల కుడితిని కలియతెడుతూ తాటాకుల దడిపక్కనున్న గేదెకేసి చూసింది.

ఆమె గుండెలు ఒక్కసారిగా దిగ జారినయ్!

మూణ్ణెల్ల దూడ గేదె పక్కన మత్తుగా పడుకొనివుంది ఎవడ్రెవ్వడు మెడ పలుపుతాడు విప్పాకొండో, ఎప్పుడు పాలుతాగిందో, లేవలేకుండ పడిఉంది. నిన్నటిరోజున గేదె కట్టు గొయ్యతాడు విప్పుకొని దూడదగ్గర కెళ్ళి పాలు ఇచ్చింది. ఇవ్వాళ దూడ తాడుతెంపుకొని గేదెదగ్గర పాలుతాగి పడుకొంది. అంతకు క్రితంరోజు గేదెముందు మోపెడు పచ్చగడ్డివేస్తే, అరగంట తర్వాత

పిచ్చుకక్కూడా వరకలేదు. ఇదీ మాయా? మంత్రమా? - సుబ్బమ్మ చోద్యంగా వాపోతూ దిగాలుపడిపోయింది. కొన్ని క్షణాలపాటు ఆమె వొళ్ళు స్తభించిపోయినట్లయింది. నిన్న పాలకేంద్రానికి పాలుపోయలేదు. ఇవాళ కూడా పాలుపోసే గీతలేదు. అసలు వారం పదిరోజుల నుంచీ గేదె పాలు సరిగ్గా ఇవ్వడం లేదు. ఎవరో కళ్లల్లో కారపునీళ్ళు చల్లుకొని, బంగారంలాంటి గేదెకు దిష్టిపెట్టారు.

'ఏమయ్యోయ్!' మొగుడికోసం గావుకేక పెట్టింది సుబ్బమ్మ.

ఆ కేక గుండెల్లో గుచ్చుకోగా, చివుక్కుని లేచి, మొలపంచ సర్దుకొంటూ పరుగెత్తుకొచ్చాడు రంగయ్య.

అరున్నర శ్రుతిలో అంతా విడమర్చి చెప్పింది సుబ్బమ్మ. చివరకు ఇట్లా అంది.

'ఇదేదో అయినోళ్లు చేస్తూన్న ఇంకచండాలం మల్లే ఉందయ్యోయ్! సందేహం లేదు. పాడిమీద వదిరాళ్ళు సంపాయించుకొంటూంటే చూడలేక, ఇట్టాంటి పనులు చేస్తున్నారు. ఎవరో ఒకళ్ళు కుతంత్రంతో చేసిందేగానీ, గేదె, దూడ తెలివిమీరి చేసిందికాదు ఈ దుండగం. ఇక్కడి వాళ్ళదేగానీ, పక్కవీధినుంచి వచ్చి ఎవ్వరూ చేయరు. ఏమయ్యోయ్, నువ్వు బెల్లంకొట్టిన రాయిలా ఉంటే, రేపొద్దున మన కళ్ళెదుట గేదెను తోలుకొని, తమ దొడ్లో కట్టేసుకుంటారు' అన్నది సుబ్బమ్మ కుండబద్దలుకొట్టినట్టు.

రంగయ్య భార్య అభిప్రాయానికి అవునని తల ఆడించలేదు; కాదని తల పైకెత్తలేదు. గేదె, దూడకేసి అమాయకంగా చూస్తూ నిలబడ్డాడు.

సుబ్బమ్మ కేకలను పదిగజాల దూరంలో చావటి మెరాబాలో పాలు పితుకుతూన్న తోడుకోడలు ఆదెమ్మకూడా వింది.. ఏమీతోచక దూడ తల నిమురుతూన్న ఆమె మొగుడు సూరయ్యకూడావిన్నాడు. అయితే వదినె ఎవర్ని దృష్టిలోపెట్టుకొని ఆ మాటలు అంటున్నదో సూరయ్య గ్రహించలేదు. ఆదెమ్మ మట్టుకు ఇట్టే గ్రహించింది. తోడుకోడలు తనమీద ధ్వజమెత్తిందనీ, ఆ సూటి పోటి మాటలన్నీ తనని గురించేననీ, తను నోరుమూసుకూర్చుంటే వ్యవహారం ముదిరిపోతుందనీ ఆదెమ్మ అనుకొంది. పాలు పితకడం అయిన తర్వాత, ఆ తప్పేలాను మొగుడికిచ్చి - నోరువిప్పింది.

'...ఏడో సామెత చెబుతారే!.. తనకు లేదని ఏడిస్తే ఒకకన్నుపోయిం

దట! ఇంకోళ్ళకున్నదని ఏడిస్తే రెండోకన్ను కూడా పోయిందట! లేనిపోనిదానికి ఇరుగుపొరుగు మీద బడి ఏడ్చేవాళ్ళకు భగవంతుడు అంతరాతా రాస్తాడు. ఈ చుట్టుపక్కల అందరూ దొరలేగానీ, సోములూ, దుండగులూ ఎవరూ లేరు. పొద్దుపొడవకముందే నోరు పారేసుకున్నందువల్ల ప్రయోజనం లేదు'

తనభార్య నూరేకారంలా మండిపోవడంలో ఔచిత్యం సూరయ్యకు అర్థంకాలేదు. అయినా అతగాడు నోరెత్తలేదు. పాలతపేళా పుచ్చుకొని నిశ్శబ్దంగా నిలబడ్డాడు.

తూర్పురేకలు మెలమెల్లగా విచ్చుకొంటున్నాయి. ఊళ్లో సందడి జాస్తి కాజొచ్చింది.

సుబ్బమ్మలో ఉక్రోశం ఉవ్వెత్తున లేచి, కయ్యానికి కాలుదువ్వింది. ఈ వారం అంతా పాలఅమ్మకం మీద రాబడి అంతంత మాత్రమేనని అనుకొన్నప్పుడు ఆమె వొళ్ళంతా కుతకుత లాడసాగింది.

'నేను నిన్న మీ పల్లెత్తుమాట అనలేదే పిల్లా! ఎందుకట్టా వొంటికి కారం పూసుకొంటావ్? గుమ్మడికాయ దొంగలాగా అనవసరంగా భుజాలు తడుముకొంటున్నావు. కాబట్టి ఈ కానిపని నువ్వే చేసివుంటావ్!' అన్నది సుబ్బమ్మ మనస్సులోని అనుమానాన్ని వెళ్లగక్కుతూ.

'ఒసేవ్! నీకెన్ని గుండెలే! ఈ అభాండం నామీద వేస్తావుటే! మొన్న మా ఇంట్లో నేతిగిన్నె పోయింది. నిన్న సబ్బుపెట్టె పోయింది. ఇవన్నీ నీ పనే అయివుంటుంది. దొంగతనాలు అంటగట్టడం నీఒక్కదానికే చేతనవుననుకున్నావా?.... ఏమయ్యోయ్! మీ వదినెమ్మ వొళ్లు పొగరెక్కి అట్లా నోటికొచ్చినట్లు కూస్తూంటే, కళ్ళు మూసుకొని జపం చేస్తున్నావా? వొంట్లో చీమూ, నెత్తురూ లేదా?' అన్నది అదెమ్మ మొగుడికేసి తిరిగి.

అప్పటికే సూరయ్య పాలతపేళా పుచ్చుకొని వంటగదిలోకి పిల్లికూనలా నడిచాడు.

తోడికోడళ్ళ మధ్య తుఫాను లేచిందనే భయంతో రంగయ్యకూడా మెల్లగా ఆ దృశ్యంనుంచి తప్పుకొని, ఇంట్లోకి వెళ్ళి తల్లిని లేపాడు.

మంగమ్మ కళ్ళు నులుముకొంటూ 'ఏమిట్రా తెల్లారకముందే కిచులాట మొదలెట్టారు' అంటూ రంగం మధ్యకొచ్చి నిలబడింది.

తోడికోడళ్ళ నోళ్ళకు తాళాలు పడ్డాయి.

అదెమ్మ చరచరా వంటగదిలోకి

వెళ్ళింది. కడుపునిండా పాలుతాగి, అయితిగానే పడుకొన్న దూడను కసికొద్దీ ఒక్క తన్ను తన్ని ఇంట్లోకి జరజరా నడిచింది సుబ్బమ్మ.

ఆ రోజు కూడా సుబ్బమ్మ, మొగుణ్ణి పాలకేంద్రానికి పంపించలేకపోయింది. సూరయ్యే మామూలుగా రెండులీటర్ల పాలను పాలకేంద్రానికి తీసుకెళ్ళాడు. సుబ్బమ్మ కడుపులో ఆ రోజంతా పొగలూ, సెగలుగా చెలరేగుతూనే ఉంది. దానికితోడు ప్రతీకారవాంఛ నివురుగప్పిన నిప్పులా ఉంది.

ఊళ్ళోకి పాలకేంద్రం వచ్చిన దగ్గర్నుంచీ రైతుల ఆర్థికవ్యవస్థ బాగా మెరుగుపడిందని చెప్పవచ్చు. ముఖ్యంగా స్త్రీల చేతుల్లో డబ్బు మెలగుతూ ఉంది. పాడిమీద నెలకు వందరూపాయలనుంచి, మూడువందల రూపాయలదాకా సంపాదించే గృహిణులు ఎంతోమంది ఉన్నారు. పైపెచ్చు, పాడి పరిశ్రమ అనేది మున్నూట అరవై నాలుగు రోజులూ వుండేది. పొలంపనులు సంవత్సరంలో ఆరుమాసాలు మాత్రమే. పాలసేకరణ పథకాలను ప్రభుత్వం అమలు జరపడం మొదలెట్టాక, ఒక రకంగా గ్రామీణ ఆర్థికవ్యవస్థలో చైతన్యం వచ్చిందని చెప్పవచ్చు. రంగయ్య, సూరయ్య మొదలైన కుటుంబాలు వచ్చవచ్చగా ఉంటున్నాయి.

సుబ్బమ్మ రోజూ నాలుగు లీటర్ల పాలు కేంద్రానికి సప్లయి చేస్తూండేది. ఆమెదగ్గరున్న గేదె చాల మంచిది. ఆ గేదెను కొనడానికి నాలు గొందలు మొగుడి చేత ప్రోనోటు వ్రాయించింది. ఏటవతల కేసరిగూడెంలో ఆ గేదెను కొన్నారు. ఆ గేదె వచ్చినప్పట్నుంచీ సుబ్బమ్మ ఇల్లు పచ్చబడింది.

రెండునెలల్లో అప్పు తీరింది. మరో మూడునెలల్లో పోతుటునం కూడా వెళ్ళమారిపోయింది. అప్పట్నుంచీ సుబ్బమ్మ పాడి సంపాదనతో రెండు పట్టుచీరలు కొంది; మూడు సవర్నలతో ఒక గొలును చేయించుకొంది; పిల్లవాడికి మంచి బట్టలు కుట్టించింది; వారానికి రెండు మూడుసార్లు పిండివంటలు చేస్తున్నది; రంగయ్య గుళ్లో అయిదు పైసల పేకాటకూడ ఆడుతున్నాడు. పాల అమ్మకంతో సుబ్బమ్మ కుటుంబ ఆర్థికవ్యవస్థలో వచ్చిన పరిణామానికి, ఆ వీధిలో చాలమంది అబ్బురపడసాగినారు. ముఖ్యంగా తోడికోడలు ఆదెమ్మకు కంటిమీద కునుకులేదు.

ఆదెమ్మ దగరున్న గేదె అంతగా మంచిదికాదు. ఎంత దానా పెట్టినా

మామూలుగా మూడు లీటర్లకంటె ఎక్కువ పాలు ఇవ్వలేదు. అందులోనే పిల్లలకు మజ్జిగనీళ్ళుపోసి రెండు లీటర్లు పాలకేంద్రానికి సప్లయి చేస్తుంది.

మంగమ్మకు ఇద్దరే కొడుకులు. ఐదేళ్ళక్రితం ఆవిడ భర్త చనిపోయినాడు. అప్పటివరకూ అందరూ ఉమ్మడి కుటుంబంగానే ఉండేవారు. తర్వాతకూడా తన మంచితనంతో ఉమ్మడి కుటుంబాన్ని పదేళ్ళపాటు నిలబెట్టాలని ప్రయత్నించిందిగానీ, కోడళ్ళ గడుసుదనంవల్ల ఆవిడఆలోచన అక్కరకురాలేదు. ఉన్న కొండ్రలో చెరిసగమూ పంచి ఇచ్చింది. ఇంటినీ, దొడ్డినీ సగంచేసి ఇచ్చింది. తాను మాత్రం సంవత్సరంలో ఆరు నెలలు పెద్దకొడుకు దగ్గిరా, మరో ఆరు నెలలు చిన్న కొడుకుదగ్గరా ఉండేట్టు నిర్ణయమైంది. ఆవిడ ఎవరిఇంట్లో ఉన్నప్పటికీ కొడుకుల విషయంలో కుడి ఎడమ భేదంలేదు. కోడళ్ళమీద ఇంకా ఆవిడకు కొద్దో గొప్పో కంట్రోలోఉంది.

ఆ పగలంతా కోడళ్ళిద్దరూ నోరు విప్పలేదు. మనస్సుల్లోనే ఉక్రోషాలు దిగమింగుకొన్నారు.

ప్రస్తుతపు కలహ కారణాన్ని మంగమ్మ గ్రహించి ఇరువురికీ విడివిడిగా హితబోధ చేసింది.

ఆ రాత్రి తొమ్మిదిన్నరకు భోంచేసితర్వాత వసారాలో పడుకున్న పిమ్మటకూడా మంగమ్మ మనసులో కొడుకులూ, కోడళ్ళు మెదిలారు. కొడుకులు అక్కుపక్షులు, వాళ్ళని కోడళ్ళు పైట కొంగులకు ముడేసుకొని ఆడిస్తున్నారు. పైపెచ్చు కోడళ్ళమధ్య పొద్దస్తమానమూ పచ్చగడ్డి భగ్గున మండుతూ ఉంటుంది. తాను 'హరీ' అన్న రోజున వీళ్ళ సంసారాలు ఏమవుతాయో, ఏమిటో... అనుకుంటూ ఆవిడ చాలసేపు ఆలోచనలతో హైరాన పడింది. ఏ అర్ధరాత్రికో కాని ఆవిడకు కునుకు పట్టలేదు.

అర్ధరాత్రిదాటాక, తాటాకు దడి చప్పుడుకు మంగమ్మకు హఠాత్తుగా మెలకువ వచ్చింది. మంచంమీద లేచి కూర్చుంది.

చిన్నకొడుకు దొడ్లోనుంచి పెద్ద కోడలు గబగబావచ్చి, వసారా పక్కగా పెరట్లోకివెళ్లింది. ఆ మనిషి సుబ్బమ్మేనని, మసక చీకట్లోకూడా చత్వారమున్న మంగమ్మపసిగట్టింది. ఆశ్చర్యంతోకూడిన నిశ్శబ్దంలో మంగమ్మ నీలుక్కుపోయింది. ఆవిడకేమీ అర్థంకాలేదు. ఈ అపరాత్రి వేళ సుబ్బమ్మ చిన్నబ్బాయి గొడ్లచావట్లోకి ఎందుకెళ్లింది? ఆ గొడ్ల చావట్లో చిన్నబ్బాయి ఉన్నాడా?

ఈ అవినీతి భాగోతం ఎన్నాళ్లనుంచి జరుగుతోందీ?....

మంగమ్మలో ఆవేశం ఉవ్వెత్తున లేవగా మంచంకిందఉన్న చేతికర్ర అందుకొని, ఓపిక తెచ్చుకొని చకచకా దడిదగ్గర కెళ్లింది. దడిని మెల్లగా నెట్టుకొని, చిన్న కొడుకు గొడ్లచావట్లోకి వెళ్లింది. ఎవ్వరూ లేరు. ఏ అలికిడీ లేదు. కాపోతే ఆదెమ్మ పాడి గేదె మాత్రం నేడ్చుగొయ్య ముందు అప్పుడే వేసిన పచ్చగడ్డిని ఆత్రంగా తింటూ వప్పుడు చేస్తూంది. గేదెముందున్న ఆ పచ్చగడ్డిని పట్టుకుచూసింది మంగమ్మ. అది జొన్నగడ్డి. అది తింటే గేదెకు ఉంగడి తగులుతుంది. ఆ రోగం తగిలితే గేదె బతకదు.

గేదె ముందున్న జొన్నగడ్డిని మంగమ్మ గబగబా బయటకు లాగి వేసింది. గేదెనోట్లో ఉన్న వరకలను కూడా లాగింది. గేదెకు కోపంవచ్చి ఒక్క అరుపు అరిచింది.

ఆ అరుపుకు ఆదెమ్మ నులకమంచం మీదనుంచి తుళ్ళిపడిలేచి, లాంతరు పుచ్చుకొని గొడ్లచావట్లోకి పరిగెత్తుకొచ్చింది.

గేదె ముందున్న జొన్న గడ్డివరకలనూ, మంగమ్మనూ చూడగా ఆదెమ్మ గుండె కోపోద్రేకాలతో లావా అయింది. మంగమ్మ మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు నిశ్చలంగా ఉంది.

'గేదె తాడు విప్పుకొని బయటకు పోయిందే! మెట్టమీద జొన్న చేలో పడితే నేనే తీసుకొచ్చి కట్టేశాను. జొన్నవరకలు తింటూంటే లాగేశాను. గేదెను గట్టిగా కట్టెయ్యడం తెలియదంటే! అసలే పాలిచ్చే గేదె....' అన్నది మంగమ్మ మందలింపుగా,

